క్లుప్తంగా

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



పిప్పర చలివేంద్రంలో మజ్జిగ పోస్తున్న ఈవో సంధ్యాదేవి

గణపవరం: గణపవరం మండలం పిప్పరలోని గ్రామ చందా సత్రం వద్ద దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని శనివారం ఈవో సంధ్యాదేవి ప్రారంభించారు. ఏటా మే నెలలో పిప్పర గ్రామం చందా సత్రం వద్ద వేసవి చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతోపాటు ఏప్రిల్ నుంచే వడగాడ్పులు వేస్తుండటంతో వారం రోజుల ముందుగానే మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు ఈవో సంధ్యాదేవి తెలిపారు.

వ్యాయామ కళాశాలకు వాటర్‌ప్లాంట్ వితరణ



గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలలో ఏర్పాటైన ఆర్వో వాటర్ ప్లాంట్

దెందులూరు: గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలకు దాతలు ఆర్వో వాటర్ ప్లాంట్ అందించారని ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. నత్తానియేలు తెలిపారు. శుక్రవారం విద్యార్థినుల హాస్టల్‌కు కానాల లక్ష్మి, ఆమె సోదరి ఆశా వెంకట పద్మకుమారి (అమెరికా) రూ. 2.50 లక్షలతో ఆర్వో వాటర్ ప్లాంటు ఏర్పాటు చేశారు. వైద్యుడు రావి గోపాలకృష్ణయ్య, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కానాల లక్ష్మీనారాయణ, సీఆర్ఆర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ అరుణ, లయన్స్ పద్మకుమారి, స్వర్ణలత పాల్గొన్నారు. దాతలను ప్రిన్సిపల్ అభినందించారు.

ఓటరు స్లిప్పుల అందజేత

ఉంగుటూరు: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓటరు స్లిప్పులు ఉంగుటూరు ఆర్వో కార్యాలయానికి చేరాయి. వచ్చిన ఓటరు స్లిప్పులను నియోజకవర్గంలోని 214 మంది బీఎల్వోలకు శనివారం ఉంగుటూరులో అందజేశారు. 2,06,433 ఓటర్లకు బీఎల్వోలు స్లిప్పులు పంపిణీ చేయాల్సి ఉంది.

నేడు అబ్బయ్యచౌదరి ప్రచారం

పెదవేగి : పెదవేగి మండలంలోని నాలుగు గ్రామాల్లో ఆదివారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొఠారు అబ్బయ్యచౌదరి ఎన్నికల ప్రచారం చేస్తారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జానంపేట బాబు అన్నారు. ఉదయం 7 నుంచి 12 గంటల వరకు బి సింగవరం, అంకన్నగూడెం గ్రామాల్లో ప్రచారం నిర్వహించి, సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు కొప్పాక, దుగ్గిరాలలో ప్రచారం నిర్వహిస్తారని బాబు తెలిపారు. ఈ ప్రచారంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొనాలని కోరారు.

ఘనంగా అన్న సమారాధన

భీమడోలు: గుండుగొలనులోని సీతారామ స్వామి ఆలయంలో వద్ద శనివారం శ్రీరామనవమి ఉత్సవాల ముగింపు పురస్కరించుకుని భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వేలాది మందిగా భక్తులు తరలివచ్చి స్వామి వారి అన్న ప్రసాదాలను స్వీకరించారు.

జయరాజు కుటుంబానికి కొఠారు పరామర్శ

దెందులూరు: చొదిమెళ్ళ జయరాజు ఆకస్మిక మరణం తమను ఎంతో బాధించిందని ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు అన్నారు. శుక్రవారం నాగులదేవునిపాడులో మృతి చెందిన జయరాజు భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బోయపాటి గణేష్, ఎంపీటీసీ సొంగా ప్రమీలారాణి వెంకటేశ్వరరావు, వార్డు మెంబరు కొండపల్లి శ్రీధర్, నాయకులు జయరాజు కుటుంబాన్ని పరామర్శించారు.

తనిఖీల్లో నగదు స్వాధీనం

గణపవరం: గణపవరంలో శనివారం ఎఫ్ఎస్‌టీ తనిఖీ బృందం చేసిన తనిఖీల్లో రూ.1.54 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. పెంటపాడు మండలం విప్పర్రుకు చెందిన గంగారామచంద్ర నుంచి రూ.70 వేలు, మండలపర్రుకు చెందిన చిరతపూడి వెంకటరామకృష్ణ నుంచి రూ.84,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల నిబంధనల మేరకు రూ.50 వేలకు మించి నగదును తీసుకు వెళ్తున్నందున వీరి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నామని తనిఖీ అధికారులు తెలిపారు.

ఉంగుటూరు: ఉంగుటూరు చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీల్లో రూ.1,27,500 నగదును పట్టుకున్నట్లు ఆర్వో ఖాజావలిలలి చెప్పారు. ఎఫ్ఎస్‌టీ టీమ్–1 సభ్యులు శనివారం వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో తణుకు నుంచి ఏలూరు వైపు వెళుతున్న ఎంవీఎల్ బాజ్జి నుంచి రూ.70 వేల నగదు పట్టుకున్నట్లు తెలిపారు. ఎఫ్ఎస్‌టీ టీమ్–2 సభ్యులు తణుకు నుంచి ఏలూరు వైపు వెళుతున్న బొప్పన శరత్‌బాబు వద్ద నుంచి రూ.57,500 నగదు పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ నగదును ట్రెజరీలో జమ చేసినట్లు ఆర్వో వివరించారు.

పేదల పెన్నిధి.. సీఎం సహాయనిధి

- పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఉపయోగం
- ప్రాణాంతక వ్యాధుల చికిత్స కోసం సాయం



ఉంగుటూరులో సలోమి కుటుంబానికి రూ.30 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు (ఫైల్)



బొమ్మిడిలో యాతం హరికృష్ణ కుటుంబ సభ్యులకు రూ.30 లక్షల చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: ఆరోగ్యశ్రీ పేరు వింటేనే అందరికీ స్ఫురించే పేరు దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి. అలవికాని వ్యాధి సోకితే ప్రాణాలు పోవడం తప్ప వైద్యం చేయించుకోలేని నిరుపేద, మధ్య తరగతి ప్రజలకు పైసా ఖర్చు లేకుండా వ్యాధిని నయం చేసి, ప్రాణం పోసిన పథకం అది. మన రాష్ట్రంలో దాదాపు రెండు దశాబ్దాల క్రితం వైఎస్సార్ కలల రూపంగా పురుడు పోసుకున్న ఈ పథకం కొన్నేళ్లపాటు సజావుగా నడిచి వైఎస్ మరణం తర్వాత పడుతూ... లేస్తూ కొనసాగి, 2014లో చంద్రబాబు హయాంలో ఈ పథకం పూర్తిగా పడకేసింది. అరకొర సాయంతో పేదలకు వైద్యం అందని ద్రాక్షగా మారింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ తనయుడు వైఎస్ జగన్‌మోహనరెడ్డి హయాంలో ఆరోగ్యశ్రీ పథకం పూర్వ వైభవం సంతరించుకుంది. ఒక్కమాటలో చెప్పాలంటే అంతకు మించి ఈ పథకం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పేరుతో పేదల ఆరోగ్యానికి పూర్తి భద్రత కల్పించింది. లక్షల ఖరీదైన రోగాలను నయాపైసా ఖర్చు లేకుండా పూర్తిగా ప్రభుత్వమే భరించి కొడిగడుతున్న ప్రాణాలను నిలబెట్టి వారి జీవితాల్లో వెలుగులు నింపింది. ఈ పథకంలో దాదాపు 3,500 రోగాలను చేర్చి పేదల ఆరోగ్యానికి పూర్తి భద్రత కల్పించింది. సీఎంఆర్ఎఫ్ పథకం ప్రాణాంతక వ్యాధులకు ఆరోగ్యశ్రీతోపాటు ప్రైవేటుగా వైద్యం చేయించుకున్న పేదలను కూడా ఆదుకునే ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కూడా జగనన్న ప్రభుత్వంలో నిరుపేదలకు ఆశాకిరణంలా వెలుగొందుతోంది. అంతకు ముందు అధికారంలో ఉన్న ప్రభుత్వాలు సీఎంఆర్ఎఫ్ పథకంలో రోగులు ఎంత ఖర్చు చేసినా అరకొరగా పదో పరకో ఇచ్చి మమ అనిపించేవి. 2019లో వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారం చేపట్టాక సీఎంఆర్ఎఫ్ పథకం పేదలకు వరంగా మారింది. ఈ పథకం కింద రోగులు ఆస్పత్రిలో పెట్టిన వైద్య ఖర్చులో దాదాపు 80 నుంచి 90 శాతం మేర చెల్లిస్తూ వారి కుటుంబాలు ఆర్థికంగా చితికిపోకుండా అండగా నిలిచింది.

ఉంగుటూరులో రూ.6.50 కోట్లు

ఒక్క ఉంగుటూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో గత ఐదేళ్లలో ముఖ్యమంత్రి సహాయనిధి పథకంలో సుమారు రూ.ఆరున్నర కోట్ల బాధితులకు నగదు రూపంలో అందించారు. జిల్లా వ్యాప్తంగా రూ.125 కోట్లకు పైగా ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న రోగులకు ప్రభుత్వం తిరిగి చెల్లించింది. వాటిలో రూ.10 వేల నుంచి రూ.30 లక్షల వరకూ బాధితులకు ప్రభుత్వం అందించింది. ఉంగుటూరుకు చెందిన ఇద్దరు కవల పిల్లలకు వచ్చిన ప్రాణాంతక వ్యాధికి సలోమి కుటుంబం దాదాపు రూ.33 లక్షలు ఖర్చుచేసి ఆర్థికంగా బాగా దెబ్బతిన్నారు. బొమ్మిడి గ్రామానికి చెందిన యాతం హరికృష్ణ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి దాదాపు ఆరునెలల పాటు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స తీసుకోగా రూ.32 లక్షల వరకూ ఖర్చయింది. ప్రాణాలు దక్కినా ఈ కుటుంబం కూడా ఆర్థికంగా బాగా దెబ్బతింది. ఈ విషయంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రత్యేకంగా చొరవ తీసుకుని సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లగా ఒక్కొక్కరికీ రూ.30 లక్షల చొప్పున ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరు చేశారు.

జగనన్నకు రుణపడి ఉంటా



నాకు రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయపడ్డాను. ఏఆస్పత్రికి వెళ్లినా బతకడం కష్టం అన్నారు. కుటుంబ సభ్యులు ఆశలు వదులుకున్నారు. ప్రైవేటు ఆస్పత్రిలో ఆరునెలలు చికిత్స పొంది ప్రాణాలు దక్కించుకున్నాను. కుటుంబ సభ్యులు సుమారు రూ.30 లక్షలు అప్పులుచేసి వైద్యం చేయించారు. ఆర్థికంగా చాలా ఇబ్బందుల్లో కూరుకుపోయాం. ఈ పరిస్థితుల్లో ఎమ్మెల్యే వాసుబాబు ప్రత్యేక కృషితో సీఎంఆర్ఎఫ్ పథకంలో రూ.30 లక్షలు మంజూరు చేయించి మా కుటుంబాన్ని నిలబెట్టారు.

– యాతం హరికృష్ణ

అర్హులందరికీ సీఎంఆర్ఎఫ్ మంజూరు



సీఎంఆర్ఎఫ్ పథకంలో నియోజకవర్గంలో సుమారు 400 మందికి రూ.6.50 కోట్లకు పైగా ఆర్థిక సహాయం అందించాం. గత ప్రభుత్వాల మాదిరిగా రాజకీయ పైరవీలు, సిఫార్సులు, కమీషన్లు లేకుండా అర్హతే ప్రామాణికంగా పార్టీలకతీతంగా సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు చేశాం. ఈ పథకంలో లబ్ధి పొందిన వారిలో సగం మంది టీడీపీ, ఇతర పార్టీలకు చెందిన వారు ఉన్నారు. ఆరోగ్యశ్రీ పథకంతో లబ్ధిపొందని వారికి సీఎంఆర్ఎఫ్ పథకంలో ఆర్థికంగా చేయూత అందించాం.

– పుప్పాల వాసుబాబు, ఎమ్మెల్యే

రాజరాజేశ్వరి అలంకరణలో రాట్నాలమ్మ

- ముగిసిన రాట్నాలమ్మ తిరునాళ్లు



రాజరాజేశ్వరి అలంకరణలో దర్శనమిస్తున్న రాట్నాలమ్మవారు

పెదవేగి: రాట్నాలకుంటలో గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీరాట్నాలమ్మ తిరునాళ్లు శనివారం ముగిశాయి. ఆఖరి రోజు అమ్మవారు శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తిరునాళ్లలో భాగంగా విఘ్నేశ్వరపూజ, నవగ్రహ మండపార్చన, పరిసర దేవతార్చన, కుంకుమార్చనలు, శ్రీరామలింగేశ్వరస్వామి శాంతి కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన చేశారు. అనంతరం మహానివేదన, దీక్షావిరమణ, ఆశీర్వచనం అందించారు. రాయన్నపాలెంకు చెందిన హరే శ్రీనివాస కోలాట భజన సమాజం కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. రాత్రి 8 గంటలకు పూలరంగడు సాంఘిక పద్యనాటకం భక్తులను అలరించింది.

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా మేనిఫెస్టో

- సంక్షేమాన్ని మరింత మెరుగ్గా అందిస్తాం
- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ




కొమిరేపల్లిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, నాయకులు

పెదపాడు: విద్య,వైద్య రంగాల్లో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేసినట్లు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు. పెదపాడు మండలంలోని చిన సత్యవోలు, సత్యవోలు, ఎస్ కొత్తపల్లి, కడిమికుంట, కొణికి, వడ్డిగూడెం, గుడిపాడు గ్రామాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అభివాదం చేస్తూ, వైఎస్సార్‌సీపీ పాలనలో అమలు చేసిన పథకాలను వివరిస్తూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ గతంలో ఇచ్చిన మేనిఫెస్టోలో 99శాతం హామీలను నెరవేర్చామని చెప్పారు. అన్నివర్గాలకు మేలు జరిగేలా ముఖ్యమంత్రి 2.0 మేనిఫెస్టో విడుదల చేసినట్లు చెప్పారు. నవరత్నాలతో పేదల జీవితాల్లో మార్పు వచ్చిందన్నారు. రైతులకు రైతు భరోసాలో ఇస్తున్న రూ.13,500కు బదులు ఇప్పుడు రూ.16వేలు ఏటా అందిస్తామన్నారు. అమ్మఒడి రూ.15వేల నుంచి రూ.17వేలకు పెంచుతామన్నారు. వాహన మిత్ర పథకంలో ఏటా రూ.10వేలు ఇచ్చామని, మరో ఐదేళ్లపాటు రూ. 10వేలు చొప్పున ఇవ్వనున్నట్లు చెప్పారు. రెండు విడతల్లో పింఛను రూ.3,500కు పెంచుతామని తెలిపారు. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకంలో రూ.3లక్షల వరకు రుణం, చేనేతలకు ఏడాదికి రూ.24వేలు వైఎస్సార్ చేయూత ద్వారా అక్కా చెల్లెమ్మలకు గతంలో ఇచ్చే రూ.75వేలతోపాటు మరో రూ.75వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు. అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ నవరత్న పథకాలు వర్తింపచేస్తున్నట్లు చెప్పారు. ఇల్లు లేని ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు అందించడంలో 60శాతం ఖర్చు చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర వడ్డి కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజీవ కుమార్, ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, ఎంపీపీ బత్తుల రత్నకుమారి, ఏలూరు నియోజకవర్గ పరిశీలకుడు, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, చింతలపూడి నియోజకవర్గ పరిశీలకుడు ముదుగురు సూర్యనారాయణ, ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ కార్యదర్శి ఆళ్ల సతీష్‌చౌదరి, జెడ్పీటీసీ నిట్లా లీలా నవకాంతం, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ అక్కినేని గోపి, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్ సంబగి శ్రావణ్‌కుమార్, విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు కత్తుల రవికుమార్, సర్పంచ్ రంభ ఉమామహేశ్వరి, వైకుంఠపు ధనంజయ్, కంభంపాటి సుబ్రహ్మణ్యం, గుణుపూరు మహేష్, సాధం కిశోర్, ముంగర రమేష్, తినాతి విజయ్, కడిమి గోవిందరావు, బత్తుల ఏసురాజు, మండల యూత్ అధ్యక్షుడు టైట్లర్ పాల్గొన్నారు.

అభివృద్ధికి పట్టం కట్టండి

దెందులూరు: గత ఐదేళ్లల్లో జరిగిన అభివృద్ధి, సంక్షేమం, టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని తేడాను గమనించి ప్రజలు ఓట్లు వేయాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ప్రజలకు సూచించారు. శనివారం కొమిరేపల్లిలో సీతంపేట సర్పంచ్ పరసా లక్ష్మీ సుజాత కనకరాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు కోటిపల్లి సురేష్, ఎంపీటీసీ పులవర్తి వరమణి, సంతోష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరిచేలా వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేయాలని అభ్యర్థించారు. నవరత్నాల పథకాలతో పాటు అనేక సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు గ్రామగ్రామాన గడపగడపకూ అందించిన ఘనత దేశంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. రానున్న ఎన్నికల్లో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా కొఠారు అబ్బయ్యచౌదరి, ఎంపీ అభ్యర్థిగా కారుమూరి సునీల్‌కుమార్‌ను గెలిపించాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ నేత చలమోలు అశోక్‌గౌడ్, కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి), నాయకులు వర్రె సత్తిబాబు, శ్రీనివాస్, ఉదయభాస్కర్, కార్యకర్తలు ఉన్నారు.

అన్ని వర్గాలకూ మేలు చేసే ఎన్నికల మేనిఫెస్టో



భీమడోలు: మరో ఐదేళ్ల పాటు సంక్షేమం, అభివృద్ధికి పెద్ద పీఠ వేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టో ప్లస్‌ను ప్రకటించారు. ఈ మేనిఫెస్టో వల్ల బడుగు, బలహీన వర్గాలు, సామాన్య కుటుంబాలకు మరింత మేలు చేకూరుతుంది. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలపై అభివృద్ధికి కంకణం కట్టుకున్నారు. ఇప్పటి వరకు అమలు చేసిన పథకాలను కొనసాగించడంతో పాటు మరింత మేలు జరిగేలా మేనిఫెస్టోను ప్రకటించారు. జగనన్నపై ప్రజలకు నమ్మకం, భరోసా ఉంటుంది. 2019 నుంచి 24 వరకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి పేద కుటుంబాలకు అండగా నిలిచారు.చంద్రబాబు కూటమి మోసపూరిత వాగ్దానాలతో ప్రజల ముందుకు వస్తున్నారు. కానీ వాటిని ప్రజలు నమ్మే స్థితిలో లేరు. రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా బ్రహ్మరథం పట్టడం ఖాయం.

– వగ్వాల అచ్యుతరామారావు, రాష్ట్ర జాయింట్ కార్యదర్శి, గుండుగొలను

ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు



భీమడోలు చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీల నిర్వహణపై సూచనలందిస్తున్న షేరింగ్ జోర్డన్ బూటియా

భీమడోలు: ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు షేరింగ్ జోర్డన్ బూటియా(ఐఆర్ఎస్) అన్నారు. జాతీయ రహదారి భీమడోలు వద్ద ఏర్పాటు చేసిన స్టాటికల్ సర్వేలైన్స్ చెక్ పోస్టు వద్ద నిర్వహణ తీరుపై ఆయనతోపాటు సహాయ వ్యయ అధికారి పీఎస్‌వీఎస్ శివనాగరాజు శనివారం ఆకస్మిక తనిఖీ చేసారు. సర్వేలైన్స్ అధికారులు చేపడుతున్న వాహనాల తనిఖీల తీరును ఆయన స్వయంగా పరిశీలించారు. చెక్ పోస్టు వద్ద గల అధికారులు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు వాహనాలను తనిఖీలు చేయాలన్నారు. ఎన్నికల పోలింగ్ సమీపిస్తున్న వేళ తనిఖీలను మరింత విస్తృతం చేయాలన్నారు. ఎంసీసీ నియమ నిబంధనలపై ప్రతి ఒక్కరికి పూర్తి అవగాహన ఉండాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు రూ.50వేల మించి నగదు,రూ.10 వేలకు మించి గిఫ్ట్‌లు తీసుకుని వెళ్తే వాటిని సీజ్ చేయాలన్నారు.

మండుటెండలోనూ ఆహ్లాదకర ప్రయాణం



ఇరువైపులా చెట్లతో చల్లని నీడతో నిండిన గణపవరం-విప్పర్రు రహదారి

రోడ్డుకిరువైపులా పెరిగిన వృక్షాలు

గణపవరం: నెలరోజుల ముందే వేసవి తన ప్రతాపాన్ని చూపిస్తోంది. ఏప్రిల్‌లోనే ఉష్ణ తాపాన్ని ప్రజలు చవిచూస్తున్నారు. ఇప్పుడే 45 డిగ్రీలకు మించిన ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రయాణాలంటేనే ప్రజలు హడలిపోతున్నారు. ముఖ్యంగా మిట్ట మధ్యాహ్నం రోడ్డుపై ద్విచక్ర వాహనాలు, సైకిళ్లపై వెళ్లాల్సి వస్తే నరకమే. అయితే గణపవరం నుంచి విప్పర్రు మీదుగా తాడేపల్లిగూడెం వెళ్లే రోడ్డు మాత్రం ప్రయాణికులకు మండు వేసవిలో చల్లదనంతో ఎంతో హాయినిస్తోంది. దీనికి కారణం ఈరోడ్డుకు ఇరువైపులా విరివిగా పెరిగిన వృక్షాలు. రోడ్డు పొడవునా చెట్లు గొడుగులా కమ్మేయడంతో రోడ్డంతా నీడతో నిండి, వాతావరణం ఆహ్లాదాన్ని కలిగిస్తోంది. మండలంలోని పిప్పర- చిలకంపాడు, పిప్పర- అత్తిలి, అప్పనపేట- జల్లికాకినాడ, రావులపర్రు- ఉంగుటూరు, చిలకంపాడు- కాశిపాడు గ్రామాలకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్లకు ఇరువైపులా చెట్లు పెరగడంతో ఆ రోడ్ల మీదుగా మధ్యాహ్నం సమయంలో వెళ్లినా ప్రయాణం ఆహ్లాదకరంగానే సాగుతుంది.

రైతుల పక్షపాతి సీఎం జగన్



రాచూరు ప్రచారంలో పాల్గొన్న పుప్పాల వాసుబాబు, నౌడు రమణ, నాయకులు



నిడమర్రులో ఇంటింటి ప్రచారంలో పుప్పాల కన్నబాబు, నాయకులు

ఉంగుటూరు: అన్ని వర్గాలకు మేలు చేసే మేనిఫెస్టో సీఎం జగన్ విడుదల చేశారని ముఖ్యంగా మహిళలు, రైతుల పక్షపాతిగా వారికి మేలు చేసే ఎన్నో హామీలిచ్చారని వైఎస్సార్ సీపీ ఉంగుటూరు ఎమ్మెల్యే అభ్యర్థి పుప్పాల వాసుబాబు అన్నారు. శనివారం మండలంలోని రాచూరులో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, పార్టీ శ్రేణులు, మహిళలు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

ప్రతి గ్రామంలో సచివాలయ భవనాలు

నిడమర్రు: నిడమర్రు గ్రామం పరిధిలో శనివారం ఇంటింటికీ వైఎస్సార్ సీపీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సోదరుడు, మండల పార్టీ బాధ్యుడు పుప్పాల కన్నబాబు నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ గతంలో చాలా చోట్ల గ్రామ పంచాయతీ భవనాలు శిథిలావస్థకు చేరి కూలిపోయే స్థితిలో ఉండేదని, నేడు ఆధునిక సౌకర్యాలతో కూడిన సచివాలయ భవనాలు ప్రతి గ్రామాల్లో నిర్మించిన విషయం ప్రజలు గమనించాలన్నారు. గ్రామంలో జరిగిన అభివృద్ధి, అందుతున్న సంక్షేమాన్ని గుర్తించి ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి వాసుబాబును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ప్రచారం చేసారు. ఈ ప్రచారంలో జెడ్పీటీసీ కోడే కాశి, స్టేట్ బీసీ నాయకులు నౌడు వెంకట రమణ, సర్పంచ్ పాట్నూరి ఉమామహేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు గుడిసే జాన్‌బాబు, ఆర్‌బీకే మండల చైర్మన్ పోలిశెట్టి రమేష్, ఎంపీటీసీ దూసనపూడి సత్యనారాయణ, వగ్వాల శ్రీను, వగ్వాల నాని, వగ్వాల రాధా కృష్ణ, కన్నాజి బాలాజీ. పేరిచర్ల రాంబాబు, చలంశెట్టి బాబులు, నడిమింటి వెంకటేష్, వేగిరెడ్డి దొరబాబు, సేనాపతి శ్రీను, మండా పోలయ్య, పేరిచర్ల రాంబాబు, పిండి శ్రీను, పెద్ది రెడ్డి సత్యనారాయణ, పోలిశెట్టి శివ, చిన శ్రీను, ఎస్ ఏసు తదితరులున్నారు.

ఆర్వో కార్యాలయం పరిశీలన

ఉంగుటూరు : ఎన్నికల్లో పోటీ చేసే పార్లమెంటు అభ్యర్థి రూ.95లక్షలు, ఎమ్మెల్యే అభ్యర్థి రూ.40 లక్షలకు మించి ఖర్చుచేయరాదని ఎన్నికల ఏలూరు పార్లమెంటు వ్యయ పరిశీలకులు జోర్డన్ బూటియా తెలిపారు. శనివారం ఉంగుటూరు ఆర్వో కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. పోటీచేసే అభ్యర్థి నామినేషన్ వేసిన తేదీ నుంచి ఫలితాలు ప్రకటన వెలువడేవరకు ప్రత్యేకమైన, సరైన ఖాతాను నిర్వహించాలన్నారు. అకౌంటింగ్ టీముకు పలు విధానాలను ఆయన వివరించారు.

బెయిలీ వంతెనపై ప్రయాణానికి ఇక్కట్లు

ఇనుప ప్లేట్లు శిథిలం





గుండుగొలను కాలువపై గల బెయిలీ అడుగు భాగాన ఏర్పడిన భారీ రంధ్రాలు, వంతెనపై దెబ్బతిన్న ఇనుప రేకులు

భీమడోలు: గుండుగొలను గోదావరి కాల్వపై తాత్కాలికంగా నిర్మించిన బెయిలీ బ్రిడ్జి అడుగు భాగాన ఉన్న ఇనుప రేకులు పాడై భారీగా రంధ్రాలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. గోదావరి కాల్వపై బ్రిటిష్ కాలంలో నిర్మించి వంతెన శిథిలావస్థకు చేరండంతో దాన్ని తొలగించి అక్కడ నూతనంగా వంతెన నిర్మిస్తున్నారు. ప్రయాణికులకు రాకపోకలకు ఇబ్బందిలేకుండా గతంలో నిర్మించిన బెయిలీ బ్రిడ్జిపై ప్రస్తుతం ఇనుప రేకులు దెబ్బతిన్నాయి.

యుద్ధ ప్రాతిపదికన నూతన వంతెన నిర్మాణం

ఉంగుటూరు, దెందులూరు ఎమ్మెల్యేలు పుప్పాల శ్రీనివాసరావు, కొఠారు అబ్బయ్య చౌదరితో ప్రత్యేక చొరవ ఫలితంగా రూ.4.2 కోట్లతో కొత్త వంతెన నిర్మాణం పనులు యుద్ధప్రాతిపదికన సాగుతున్నాయి. బెయిలీ వంతెనపై భారీ వాహనాలు రాకపోకలు సాగించకుండా గడ్డర్లును ఏర్పాటు చేసారు. సంబంధిత శాఖల అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఆక్వా రైతులు గడ్డర్లు తొలగించారు. దీనితో సామర్థ్యానికి మించి అధిక లోడు గల ఆక్వా మేత లారీలు వంతెనపై యథేచ్ఛగా రాకపోకలు సాగించడంతో రెండేళ్ల కాల పరిమితి గల ఆ వంతెనలోని కింద ఉన్న ఐరన్ ప్లేట్లు పూర్తిగా దెబ్బతిన్నాయి.దీంతో బైక్‌లు, ఆటోలు ఇతర వాహనాలు వంతెనపై రాకపోకలు సాగించాలంటే ప్రజలు హడలి పోతున్నారు. భీమడోలు, దెందులూరు, ఏలూరు మండలాలకు చెందిన వాహనదారులందరూ ఈ బ్రిడ్జి మీదుగా రాకపోకలు సాగిస్తారు. రాత్రి వేళలో అప్రమత్తంగా ఉండకుంటే వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు సంభవిస్తాయని ప్రజలంటున్నారు. ప్లేట్లు దెబ్బతిన్న చోట ప్రజలను అప్రమత్తం చేసేందుకు పంచాయతీ అధికారులు జెండాలను ఉంచారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు గ్రామస్తులు కోరుతున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ ఏఈ జే భాస్కరరావు వివరణ కోరగా సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు.